# అనాథ పిల్లలకు దుస్తుల పంపిణీ



బాలసదనంలో అనాథ పిల్లలకు దుస్తులు పంపిణీ చేస్తున్న ప్రతిమారెడ్డి

పరిగి, మార్చి 18 : అసెంబ్లీ మాజీ డిప్యూటీ స్పీకర్ స్వర్గీయ కొప్పుల హరీశ్వర్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా సోమవారం పరిగిలోని బాలసదనంలో అనాథ పిల్లలకు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పి.వెంకటయ్య సొంత డబ్బులతో కొనుగోలు చేసిన దుస్తులను మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి సతీమణి ప్రతిమారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎస్.భాస్కర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పి.వెంకటయ్య, కౌన్సిలర్లు ఎదిరె కృష్ణ, వెంకటేశ్, బీఆర్‌ఎస్ నాయకులు తాహెర్‌అలీ, ప్రవీణ్, లక్ష్మి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

# బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి



మాట్లాడుతున్న సీఐ శ్రీధర్‌రెడ్డి

కొడంగల్, మార్చి 18: బార్డర్ చెక్‌పోస్టు వద్ద నియమితులైన పోలీసులు, ప్రత్యేక బలగాల సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సీఐ శ్రీధర్‌రెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని కస్తూర్‌పల్లి గ్రామ ప్రాంతంలోని తెలంగాణ-కర్ణాటక బార్డర్‌లో పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును సీఐ తనిఖీ చేశారు. చెక్‌పోస్టు వద్ద పరిసరాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలను అందించారు. ఎప్పటికప్పుడు వాహన తనిఖీలు నిర్వహిస్తూ వివరాలను సేకరించి రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై భరత్‌రెడ్డితో పాటు పోలీసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మంచినీటి బాటిళ్లు అందజేత



ఉచితంగా అందజేసిన మంచినీటి బాటిళ్లతో విద్యార్థులు

పరిగి టౌన్, మార్చి 18: 1996-98 బ్యాచ్‌కు చెందిన పరిగి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థులు సోమవారం చిట్యాల్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా మంచినీటి బాటిళ్లను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉస్మాన్‌అలీ, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

# కొబ్బరికాయల విక్రయానికి వేలం పాట



వేలం పాట నిర్వహిస్తున్న ఈవో సుధాకర్, చైర్‌పర్సన్ నర్సమ్మ

కులకచర్ల, మార్చి 18 : మండల పరిధిలోని బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని పాంబండ రామలింగేశ్వర స్వామి ఆలయంలో కొబ్బరికాయల విక్రయానికి సోమవారం వేలం పాట నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి సుధాకర్, ఆలయ కమిటీ చైర్‌పర్సన్ నర్సమ్మ తెలిపారు. ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 9వరకు రామలింగేశ్వర బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన కాశమోని మల్లేశ్ రూ. 5లక్షల 71వేలకు కొబ్బరికాయలు విక్రయించుకోవడానికి వేలం పాటలో దక్కించుకున్నారని తెలిపారు. ఈ కొబ్బరికాయలు ఉత్సవాల్లో మాత్రమే విక్రయించేందుకు అనుమతి ఇచ్చామన్నారు. కార్యక్రమంలో శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం జిల్లెలగూడ ఆలయ ఈవో, పర్యవేక్షకుడు శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితాలో తప్పులుంటే సరిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

బషీరాబాద్, మార్చి 18 : ఓటరు జాబితాలో ఏమైనా తప్పులుంటే సరి చేయాలని తహసీల్దార్ వెంకటేశ్ సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌వోల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. ఎన్నికల కమిషన్ పార్లమెంట్ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేయడంతో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైందన్నారు. చనిపోయిన వారి పేర్లు ఉంటే ఓటరు జాబితా నుంచి తొలగించాలని సూచించారు. కొత్త ఓటర్లను చేర్పించేందుకు ఇంకా అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాఘవులు, ఎంపీవో రమేశ్, వివిధ గ్రామాల బీఎల్‌వోలు పాల్గొన్నారు.

# తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



కులకచర్లలో బోరును పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి

కులకచర్ల, మార్చి 18 : కులకచర్ల గ్రామ పంచాయతీలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటామని కులకచర్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం కులకచర్లలో పాడైన బోరును, వృథాగా నీటిని విడిచిన నల్లాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కులకచర్ల గ్రామ పంచాయతీలో తాగునీటి సమస్య రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇంటింటికి ఏర్పాటు చేసిన నల్లానీటికి సంబంధించి ప్రతి ఇంటిలోనూ నల్లాలకు ఆన్‌ఆఫ్‌లు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. వేసవిలో నీటిని వృథా చేయకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. నల్లాలకు ఆన్‌ఆఫ్‌లు ఏర్పాటు చేయకుంటే కనెక్షన్లను తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



బొంరాస్‌పేట: హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



పెద్దేముల్ : పరీక్ష రాయడానికి కూర్చున్న విద్యార్థులు

# పకడ్బందీగా పది పరీక్షలు

- ఆటోలు, ప్రైవేటు వాహనాల్లో పరీక్షా కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులు
- పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- పటిష్టమైన పోలీసు బందోబస్తు



కొడంగల్: పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో రాంరెడ్డి



బొంరాస్‌పేట: పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు



తాండూరు: విద్యార్థులను పరిశీలిస్తున్న సిబ్బంది

కొడంగల్, మార్చి 18 : పదో తరగతి పరీక్ష పట్టణ పరిధిలోని 4 కేంద్రాల్లో మొదటిరోజు సోమవారం ప్రశాంతంగా జరిగింది. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో ఏ, బీ రెండు కేంద్రాలు, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరో రెండు కేంద్రాలను ఏర్పాటు చేశారు. నాలుగు కేంద్రాల్లో మొత్తం 907 మంది విద్యార్థులు తెలుగు పరీక్ష రాయాల్సి ఉండగా 5 గురు విద్యార్థులు గైర్హాజర్ కాగా 902 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు ఎంఈవో రాంరెడ్డి తెలిపారు. మొదటిరోజు కావడంతో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు పరీక్షా కేంద్రానికి తరలి రావడంతో కేంద్రాల వద్ద సందడి నెలకొంది. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

**బొంరాస్‌పేట :** పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. బొంరాస్‌పేట ఉన్నత పాఠశాలలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. బొంరాస్‌పేట మండలంలోని బొంరాస్‌పేట, చౌదర్‌పల్లి, బొట్లవానితండా బాలికల ఆశ్రమ పాఠశాల, రేగడిమైలారం, బురాన్‌పూర్ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు, దుద్యాల మండలంలోని దుద్యాల, హకీంపేట, చెట్టుపల్లితండా కేజీబీవీ పాఠశాలల నుంచి మొత్తం 517 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా ఒక విద్యార్థి గైర్హాజరయ్యారు. ఏ కేంద్రంలో 247 మందికి 246 మంది, బీ కేంద్రంలో 270 మందికి 270 హాజరయ్యారు. పరీక్షా కేంద్రానికి చేరుకోవడానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ఆటోలు, డీసీఎంలు, బైకులపై చేరుకున్నారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే కేంద్రంలోకి అనుమతించారు. ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బందికి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వాచ్‌లను అనుమతించలేదు. పరీక్షా కేంద్రంలో సిటింగ్ స్క్వాడ్‌ను నియమించారు. పరీక్షా కేంద్రం వద్ద ఎస్సై అబ్దుల్ రవూఫ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

**తాండూరు :** పదోతరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం తాండూరు నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. తాండూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, నంబర్-1 ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉర్దూ మీడియం పాఠశాల, సెయింట్‌మార్క్స్ హైస్కూల్, సెన్‌మేరి హైస్కూల్, న్యూనలంద హైస్కూల్, గంగోత్రి విద్యాలయ, శ్రీసరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాల, ఫ్రంట్‌లైన్ స్కూల్, శివసాగర్, కృష్ణవేణి టాలెంట్ స్కూల్, విజయ విద్యాలయ హైస్కూల్‌తో పాటు మండల పరిధిలోని జడ్పీహెచ్‌ఎస్ కరణ్‌కోట్, జెడ్పీహెచ్‌ఎస్ మల్కాపూర్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన 14 పరీక్షా కేంద్రాల్లో 2,292 మంది విద్యార్థులకు 12 మంది గైర్హాజరయ్యారని తాండూరు ఎంఈవో వెంకటయ్యగౌడ్ తెలిపారు. బషీరాబాద్ మండలం జడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాల, జడ్పీహెచ్‌ఎస్ బాలికల పాఠశాల, తెలంగాణ మాడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన 3 పరీక్షా కేంద్రాల్లో 508 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 7 గురు విద్యార్థులు గైర్హాజరు కావడంతో 501 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు ఎంఈవో సుధాకర్‌రెడ్డి తెలిపారు. యాలాల జడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాల, జడ్పీహెచ్‌ఎస్ అగ్గనూరు పాఠశాల, గౌతమి మాడల్ స్కూల్, ప్రతిభ స్కూల్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన 4 పరీక్షా కేంద్రాల్లో 715 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 5 గురు విద్యార్థులు గైర్హాజర్ కావడంతో 710 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పరీక్షల కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి పరీక్షలు సజావుగా జరిగేందుకు పోలీసులు గట్టి బందో బస్తు ఏర్పాటు చేశారు. విద్యాధికారులతో పాటు స్పెషల్ స్క్వాడ్ బృందం పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. మొదటి రోజు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు జరిగినట్లు తెలిపారు.

**పెద్దేముల్ :** మండల కేంద్రంతోపాటు మంబాపూర్ పరీక్షా కేంద్రంలో పదో తరగతి పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా ముగిసింది. మండల పరిధిలోని పెద్దేముల్ బాలుర ఉన్నత పాఠశాలలో 198 మందికి 198 మంది, బాలికల ఉన్నత పాఠశాలలో 182 మందికి 182 మంది, మంబాపూర్ ఉన్నత పాఠశాలలో 194 మందికి 192 మంది విద్యార్థులు, మొత్తం 574 మందికి 572 మంది హాజరైయ్యారు. ఎస్సై గిరి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. పరీక్షా కేంద్రాలను స్థానిక ఎంపీడీవో జర్నప్ప పరిశీలించారు.

**పరిగి :** పరిగి పట్టణంలోని 9 పరీక్షా కేంద్రాల్లో సోమవారం ప్రారంభమైన పదో తరగతి పరీక్షలకు మొదటి రోజు 1,487 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎంఈవో హరిశ్చందర్ ఒక ప్రకటనలో తెలిపారు. 9 పరీక్షా కేంద్రాల్లో సోమవారం మొత్తం 1,492 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా ఐదు గురు గైర్హాజరయ్యారని తెలిపారు.

**ధారూరు :** పదో తరగతి వార్షిక పరీక్షల కోసం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల, కెరెళ్లి జడ్పీహెచ్‌ఎస్‌లో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండలంలోని ధారూరు, ధారూరు(బాలికల), నాగారం, కెరెళ్లి, కుక్కింద, తరిగోపుల, నాగసముందర్, మోమిన్‌కలాన్, కేజీబీవీ పాఠశాలల నుంచి మొత్తం 313మంది విద్యార్థులకు 311మంది హాజరు కాగా ఇద్దరు గైర్హాజయ్యారు. మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్షా కేంద్రాల పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

**మర్పల్లి :** మండలంలోని మర్పల్లి, పట్లూర్‌లో పదో తరగతి పరీక్షల కోసం ఏర్పాటు చేసిన మూడు కేంద్రాల్లో నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈవో విద్యాసాగర్ తెలిపారు. మొత్తం 403 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 399 మంది హాజరయ్యారని తెలిపారు.

**కులకచర్ల :** కులకచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలోని 6 పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు సజావుగా జరిగాయి. మొత్తం 1075 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారని అధికారులు తెలిపారు.

# రసాభాసగా సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనసూయ

దోమ, మార్చి 18 : మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం జరి గిన సర్వసభ్య సమావేశం రసాభాసగా సాగింది. అజెండాలోని 22 అంశాలపై చర్చించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం నెలకొన్నదని పలువురు ఎంపీటీసీలు అధికారులను నిలదీశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్నదాతలకు రైతుబంధును పెంచి ఇస్తామని చెప్పి ఇప్పటికీ నాలుగు ఎకరాల పొలం ఉన్న రైతులకూ డబ్బులను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయలేదని మండిపడ్డారు. విద్యార్థులకు అల్పాహారాన్ని అందించాలని.. ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద మంజూరైన పనులకు తీర్మానాలను గ్రామ పంచాయతీలు చేయకుండా ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు చేశారని, వాటిపై చర్యలు తీసుకోవాలని ఎం పీడీవోను కోరారు. గ్రామాల్లోని ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఎంపీపీ అనసూయ, వైస్ ఎంపీపీ మల్లేశం అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# యువకుడి దారుణ హత్య!



మాట్లాడుతున్న డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి

పూడూరు, మార్చి 18 : ఓ యువకుడు దారుణ హత్యకు గురైన ఘటన వికారాబాద్-మన్నెగూడ రోడ్డు కొత్తెపల్లి సమీపంలో సోమవారం జరిగింది. పరిగి డీఎస్పీ కరుణసాగర్ రెడ్డి, సీఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. మండలంలోని మన్నెగూడ గ్రామానికి చెందిన సంజీవ్(35) ఆదివారం సాయంత్రం అతడి భార్య అనితకు మేనబావ అయిన పరిగి మండలంలోని శివారెడ్డిపల్లి గ్రామానికి చెందిన గోపాల్ కారులో వెళ్లినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఆ కారు సంజీవ్ బామ్మర్ది అయిన దోమ మండలంలోని బొంపల్లి గ్రామానికి చెందిన శ్రీనివా స్‌దిగా పోలీసులు గుర్తించారు. అయితే వారు కారులో ఎక్కడికెళ్లారు.. అక్కడ ఏమి జరిగిందో తెలియదు కానీ.. సంజీవ్ మాత్రం హత్యకు గురయ్యాడు. కాగా గోపాల్ మొబైల్‌కు ఫోన్‌చేస్తే స్విచ్ఛాఫ్ అని వస్తుండడంతో పోలీసులు అతడి కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పరిగి ప్రభుత్వ దవాఖానకు తరలించి అనంతరం వారి బంధువులకు అప్పగించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి కేసును దర్యాప్తు చేస్తున్నారు. కాగా నిందితులను గుర్తించి పట్టుకునే వరకూ మృతదేహాన్ని పూడ్చేదీ లేదంటూ కుటుంబీకులు, బంధువులు పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. నిందితులకు కచ్చితంగా శిక్షపడేలా చూస్తామని డీ ఎస్పీ కరుణసాగర్‌రెడ్డి ఇచ్చిన హామీతో వారు శాంతించారు.

# అతివేగం.. బోల్తాపడిన కారు

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి
- మృతులు కర్ణాటకవాసులుగా గుర్తింపు
- కేసు నమోదు చేసిన షాద్‌నగర్ పోలీసులు

షాద్‌నగర్, మార్చి 18 : అతివేగంగా వెళ్తున్న కారు అదుపు తప్పి బోల్తాపడిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. ఆ ఘటన ఫరూఖ్‌నగర్ మండలంలోని లింగారెడ్డిగూడ 44వ జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం కర్ణాటక రాష్ట్రం మైసూరు నగరానికి చెందిన రత్నాకర్( 66), నర్సింహ్మన్ అయ్యర్ (47) మరో నలుగురితో కలిసి కాశీ యాత్రకు కారులో బయలుదేరారు. లింగారెడ్డిగూడ 44వ జాతీయ రహదారిపైకి రాగానే కారు అతివేగంగా వెళ్తూ ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో రత్నాకర్, నర్సింహ్మన్‌అయ్యర్ ఇద్దరు అక్కడిక్కడే మృతిచెందారు. కారులో ప్రయాణిస్తున్న మరో నలుగురులో మదన్‌కుమార్ తీవ్రంగా గాయపడగా.. మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న షాద్‌నగర్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని క్షతగాత్రులు, మృతదేహాలను షాద్‌నగర్ సర్కారు దవాఖానకు తరలించారు. మృతులు రత్నాకర్ క్యాటరింగ్ చేస్తూ జీవిస్తుండగా.. నర్సింహ్మన్‌అయ్యర్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అని పోలీసులు తెలిపారు. షాద్‌నగర్ ఏఎస్‌ఐ రాంచందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పూర్వ విద్యార్థుల ఆర్థిక చేయూత

## రూ.86వేలు అందజేత



బడంగ్‌పేట, మార్చి 18: రంగారెడ్డి జిల్లా మాడ్గుల జడ్పీహెచ్‌ఎస్‌లో 1993-1994లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ప్రమాదవశాత్తు మృతి చెందిన తోటి స్నేహితుల కుటుంబాలకు ఆర్థిక సాయం చేశారు. మాడ్గుల మండలం పెద్ద మాడ్గుల గ్రామానికి చెందిన సుదర్శన్ రెడ్డి మృతి చెందాడు. అతడికి భార్య, ముగ్గురు కూతుర్లు ఉన్నారు. అదే విధంగా మాడ్గుల మండలం నాగిల్ల గ్రామానికి చెందిన మల్లేశ్ యాదవ్ అనారోగ్యంతో మరణించాడు. అతడికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. వారికి పెద్ద దిక్కు లేక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న విషయం తెలుసుకున్న బాల్య స్నేహితులు సోమవారం సుదర్శన్ రెడ్డి కుటుంబానికి రూ.50వేలు, మల్లేశ్ యాదవ్ కుటుంబానికి రూ.36వేల ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఆపదలో ఆదుకున్న పూర్వ విద్యార్థులకు సుదర్శన్ రెడ్డి, మల్లేశ్ యాదవ్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రభుత్వ భూమిలో అక్రమంగా రోడ్డు

- ఆలస్యంగా వెలుగులోకి..
- రోడ్డును పరిశీలించిన ఆర్ఐ..
- వెంటనే తొలగించాలని హెచ్చరించిన తహసీల్దార్



అక్రమంగా నిర్మించిన రోడ్డును పరిశీలిస్తున్న ఆర్ఐ రాజు రెడ్డి

పెద్దేముల్, మార్చి 18 : ప్రభుత్వ భూమిలో అక్రమంగా రోడ్డును ఏర్పాటు చేసిన ఘటన మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జనగాం గ్రామానికి చెందిన భీమమ్మకు సర్వేనంబర్ 178లో రెండు ఎకరాల అసైన్డ్ భూమి ఉన్నది. అది తాండూరు-హైదరాబాద్ ప్రధాన రహదారికి పక్కన పట్టా భూముల పక్క న ఉన్నది. ఇక్కడ ఎకరానికి దాదాపుగా రూ.70-రూ. 80లక్షల వరకు పలుకు తుండడంతో గతవారం రోజుల క్రితం ఈ అసైన్డ్ భూమి నుంచి పట్టా భూము ల్లోకి వెళ్లేందుకు కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారుల ప్రోద్బలంతో అక్రమంగా రోడ్డును వేశారు. ఈ విషయం బయటికి పొక్కడంతో ఆర్ఐ రాజురెడ్డి అక్కడికెళ్లి పరిశీలించగా ఆ రోడ్డు ప్రభుత్వ భూమిలోంచి ఉందని గుర్తించి తహసీల్దార్ కిషన్‌కు చెప్పారు. సోమవారం తహసీల్దార్ అసైన్డ్ భూమి నుంచి రోడ్డు వేయించిన వారిని కార్యాలయానికి పిలిపించి అక్రమంగా ఏర్పాటు చేసిన రోడ్డును వెంటనే తొలగించాలని.. లేకుంటే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

# గొర్రెల పంపిణీ కేసులో..

- నిందితులను ఐదు రోజుల కస్టడీకి కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన ఏసీబీ
- నేటికి వాదనలు వాయిదా వేసిన కోర్టు

నాంపల్లి కోర్టులు, మార్చి 18 (నమస్తే తెలంగాణ): గొర్రెల పంపిణీ పథకం కేసులో పశు సంవర్ధక శాఖ అధికారి అంజిలప్ప, అసిస్టెంట్ డైరెక్టర్ డా. పి. కృష్ణయ్యను గత గురువారం ఏసీబీ అరెస్టు చేసింది. మరింత సమాచారం రాబట్టేందుకు వీరిద్దరిని విచారించేందుకు ఐదు రోజుల కస్టడీకి అప్పగించాలని ఏసీబీ అధికారులు కోర్టును కోరారు. ఏసీబీ దాఖలు చేసిన పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలంటూ నిందితుల తరపు న్యాయవాదులను కోర్టు ఆదేశించింది. దీంతో నిందితుల తరపు న్యాయవాదులు సోమవారం కోర్టులో కౌంటర్లు దాఖలు చేయగా.. కోర్టు విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. మంగళవారం ఏసీబీ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ), నిందితుల తరపు న్యాయవాదులు తమ వాదనలను కోర్టుకు వినిపించనున్నారు.

## పోక్సో కేసులో.. 20 ఏండ్ల జైలు శిక్ష

అడ్డగుట్ట, మార్చి 18 : పోక్సో కేసులో ఓ యువకుడికి న్యాయస్థానం 20 ఏండ్ల జైలు శిక్ష విధించింది. తుకారాంగేట్ పోలీసుల కథనం ప్రకారం.. నేరేడ్‌మెట్‌లోని సప్తగిరి కాలనీకి చెందిన అభిలాశ్ (25) సికింద్రాబాద్‌లోని రైల్వే ఆఫీసర్స్ కాలనీలో పిల్లలకు ట్యూషన్ చెప్పేవాడు. అతడి వద్ద ట్యూషన్‌కు వచ్చే ఆరేండ్ల బాలికతో అసభ్యంగా ప్రవర్తించడంతో విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు 2019లో తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో అభిలాశ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. దర్యాప్తు పూర్తి చేసిన పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. వాదనలు విన్న న్యాయస్థానం.. కేసు పూర్వాపరాలను పరిశీలించిన స్పెషల్ సెషన్స్ జడ్జి పి.పుష్పలత సోమవారం నిందితుడికి 20 ఏండ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

## నేటి నుంచి వెంకన్న స్వామి బ్రహ్మోత్సవాలు



వేంకటేశ్వర స్వామి మూల విరాట్

పరిగి, మార్చి 18 : పరిగి పట్టణంలోని బాలాజీనగర్‌లో వెలిసిన లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలు ఈనెల 19న ప్రారంభమై మూ డు రోజుల పాటు కొనసాగనున్నా యి. ఈ మేరకు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేపట్టారు. ఈ నెల 19న ప్రత్యేక పూజలతో పాటు స్వామి వారికి అభిషేకం, ఎదుర్కోళ్లు, 20న హోమాలు, సామూహిక కుంకుమార్చనతో పాటు ప్రత్యేక పూజ లు, 21న హోమాలు, స్వామి వారి క ల్యాణోత్సవం, ఊరేగింపు కార్యక్రమాల తో పాటు ప్రత్యేక పూజలు చేయనున్నా రు. ఈ మూడు రోజుల పాటు సాయం త్రం భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల కోసం ఏర్పాట్లు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కార్యనిర్వహణాధికారి కోరారు.

## అక్రమంగా తరలిస్తున్న డీజిల్ పట్టివేత

పెద్దేముల్, మార్చి 18 : కర్ణాటక రాష్ట్రం కుంచారం నుంచి అక్రమంగా తరలిస్తున్న డీజిల్‌ను పట్టుకున్నామని ఎస్సై గురి తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం రాత్రి వాహనాలను తనిఖీ చేస్తుండగా కర్ణాటక రాష్ట్రం కుంచారం నుంచి ఓ ట్రాక్టర్‌లో మన్సాన్‌పల్లికి చెందిన రవీందర్ రెండు వేల లీటర్ల డీజిల్‌ను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నామని తెలిపారు. డీజిల్‌కు సంబంధించి ఎలాంటి పత్రాలు చూయించలేదని, తక్కువ ధరకు కొనుగోలు చేసినట్లు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని, ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించామని తెలిపారు.

## వైభవంగా కల్యాణం

నవాబుపేట, మార్చి 18: యెల్లకొండ గ్రామంలోని పరమేశుడి ఆలయ ఆవరణలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణాన్ని ఆలయ చైర్మన్ భరత్‌రెడ్డి, వేదపండితులు అంగరంగా వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీమ్ భరత్ హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయం ప్రధాన అర్చకులు శివకుమార్ శాస్త్రి, శశికాంత్, తహసీల్దార్ జయరాం, తిరుపతిరెడ్డి, కొండల్, భక్తులు ఉన్నారు.

## శివనవీన్ కుమార్‌కు బెయిల్ పిటిషన్ దాఖలు

నాంపల్లి కోర్టులు, మార్చి 18 (నమస్తే తెలంగాణ) : అక్రమాస్తుల కేసులో రిమాండ్ ఖైదీగా కొనసాగుతున్న హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ సోదరుడు శివ నవీన్‌కుమార్ తరపు న్యాయవాదులు మూడోసారి కోర్టు ఎదుట బెయిల్ పిటిషన్‌ను దాఖలు చేశారు. దీంతో సోమవారం పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు నోటీసులు జారీ చేశారు. కౌంటర్ దాఖలు చేయాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు కోర్టు ఆదేశించింది. అవినీతి నిరోధక చట్టం 1988 ప్రకారం సెక్షన్ 12 కింద వీరిద్దరిపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు.

## రైలు ఢీ కొని వ్యక్తి మృతి

మారేడ్‌పల్లి, మార్చి 18: రైలు పట్టాల మధ్య నుంచి నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిని రైలు ఢీ కొట్టడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదం సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. అల్వాల్ - బొల్లారం బజార్ రైల్వే స్టేషన్ల మధ్య సోమవారం ఉదయం గుర్తు తెలియని ఓ వ్యక్తి పట్టాల మధ్య నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా.. అతడిని రైలు ఢీ కొట్టింది. తీవ్ర గాయాలతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకొని.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి వయసు 30- 35 ఏండ్లు ఉంటుందని వెల్లడించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## తనిఖీలు ముమ్మరం..

సిటీబ్యూరో, మార్చి 18 (నమస్తే తెలంగాణ): ఎన్నికల నిఘా బృందాలు సోమవారం నిర్వహించిన తనిఖీల్లో రూ. 1.05లక్షల నగదు, రూ.15.68 లక్షలు విలువజేసే వస్తువులను హైదరాబాద్ జిల్లా పరిధిలో సీజ్ చేసినట్లు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్ పేర్కొన్నారు. రెండు రోజుల వ్యవధిలో రూ. 17.15 విలువ కలిగిన వస్తువులను సీజ్ చేశామన్నారు. నగదు, ఇతర వస్తువులపై 8 ఫిర్యాదులు రాగా, వాటన్నింటిని పరిశీలించి పరిష్కరించినట్లు తెలిపారు. సోమవారం నిర్వహించిన తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న 54.67లీటర్ల మద్యాన్ని పట్టుకుని, ఆరుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు.